క్లుప్తంగా

తెలంగాణ పితామహుడు ప్రొఫెసర్ జయశంకర్



నివాళులర్పిస్తున్న బ్రహ్మం తదితరులు

సిద్దిపేటకమాన్: తెలంగాణ ఉద్యమానికి ప్రొఫెసర్ జయశంకర్ తన జీవితాన్ని అంకితం చేసి, రాష్ట్రానికి పితామహుడయ్యాడని సిద్దిపేట స్వర్ణకార సంఘం అధ్యక్షుడు ధర్మవరం బ్రహ్మం అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలో శనివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా బ్రహ్మం మాట్లాడుతూ తెలంగాణ ఉదమ్య ప్రస్థానాన్ని, వాదాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాస్, మద్దూరి వాసు, సూర్యం, మోహన్, నెమలిచారి, ప్రవీణ్, వెంకటేశం, భాను, నాగరాజు, సాగర్, విక్రమ్, లక్ష్మణ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారీ బడులకు 'స్పందన' చేయూత



విద్యార్థులతో స్పందన ప్రతినిధులు, ఉపాధ్యాయులు

వర్గల్(గజ్వేల్): హైదరాబాద్‌కు చెందిన స్పందన చారిటబుల్ ట్రస్ట్ మండలంలోని ఎనిమిది పాఠశాలలకు రూ.4.5లక్షల విలువైన వివిధ రకాల పుస్తకాలను అందజేసింది. ఈ సంస్థ కొన్ని సంవత్సరాలుగా ప్రతియేటా అనేక పాఠశాలలకు స్టడీ మెటీరియల్ అందజేస్తుంది. అందులో భాగంగా శనివారం వర్గల్ మండలం చౌదరిపల్లి ప్రాథమిక పాఠశాల వేదికగా వర్గల్, గజ్వేల్, మర్కూక్ మండలంలోని ఎనిమిది పాఠశాలలకు ఇంగ్లిష్ రైటింగ్, కలరింగ్, కాపీ రైటింగ్ పుస్తకాలను ట్రస్ట్ ప్రతినిధులు సాయిప్రసాద్, శ్రీనివాస్ ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి శశిధర్‌శర్మ, హెచ్‌ఎంలు జైపాల్‌రెడ్డి, రాజనరేందర్‌రెడ్డి, ప్రశాంత్, శ్రీధర్, నర్సింహారెడ్డి, బాలకిషన్, నర్సింహులు, మహేశ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య: ఎంఈఓ



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న ఏంఈఓ సత్యనారాయణరెడ్డి

దుబ్బాకటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందిస్తున్నామని రాయపోల్ మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని మంతూర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులు విద్య బోధిస్తున్నారన్నారు. విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలల్లోకి పంపి అధిక ఫీజులు చెల్లించలేక తల్లిదండ్రులు సతమతమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం నాగరాజు, పాఠశాల హెచ్‌ఎం భాస్కర్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమ్మె నోటీస్



సమ్మె నోటీసు ఇస్తున్న అంగన్‌వాడీలు

దుబ్బాక: అంగన్‌వాడీలను కార్మిక చట్టాల పరిధిలోకి తేవాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్ డిమాండ్ చేశారు. ఐసీడీఎస్ కార్యాలయంలో జులై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో పాల్గొంటామని అంగన్వాడీ టీచర్లు, హెల్పర్స్ శనివారం సమ్మె నోటీస్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు హెల్పర్లకు రూ.26 వేలు, టీచర్స్‌కు రూ.32 వేలు కనీస వేతనం అందించాలన్నారు. రిటైర్మెంట్ కనీస పెన్షన్ రూ.9 వేలు అమలు చేయాలని, ఈఎస్ఐ,పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. యూనియన్ దుబ్బాక ప్రాజెక్టు అధ్యక్షురాలు పద్మ, కోశాధికారి నాగరాణి తదితరులు ఉన్నారు.



జిల్లా కోర్టు ఆవరణలో యోగ చేస్తున్న న్యాయమూర్తులు



గజ్వేల్‌రూరల్: కోర్టు ఆవరణలో యోగా చేస్తున్న జడ్జి స్వాతిగౌడ్



మిరుదొడ్డి(దుబ్బాక): ఆసనాలతో ఆకట్టుకున్న విద్యార్థులు



సిద్దిపేటకమాన్: ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు, సిబ్బంది

యోగాతో మానసిక ప్రశాంతత

అంతర్జాతీయ యోగా వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఉత్సాహంగా ఉల్లాసంగా సాగాయి. ఈ సందర్భంగా శనివారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలు, పాఠశాలల్లో ఉద్యోగులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు. యోగాతో మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుందని పలువురు ప్రముఖులు తెలిపారు.



సిద్దిపేట: అటానమస్ కళాశాలలో.. యోగాసనాలు వేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



కొండపాకలోని హైస్కూల్లో యోగా డే ఆకృతిలో యోగాసనాలు వేసిన విద్యార్థులు



కొమురవెల్లి(సిద్దిపేట): అయినాపూర్ ఉన్నత పాఠశాలలో...



జగదేవ్‌పూర్(గజ్వేల్): ఇటిక్యాల పాఠశాలలో..



ములుగు(గజ్వేల్): అటవీ కళాశాలలో విద్యార్థుల యోగాసనాలు



మద్దూరు(హుస్నాబాద్): మోడల్ స్కూల్‌లో..



అక్కన్నపేట(హుస్నాబాద్): గౌరవెల్లి పాఠశాలలో..



చేర్యాల(సిద్దిపేట): వాకర్స్‌తో ఆసనాలు వేయిస్తున్న శిక్షకుడు కిషన్



హుస్నాబాద్: కోర్టు ఆవరణలో న్యాయమూర్తి రేవతి తదితరులు

మావోయిస్టులతో చర్చలు జరపాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి పవన్



సమావేశంలో మాట్లాడుతున్న మంద పవన్

తొగుట(దుబ్బాక): ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ డిమాండ్ చేశారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం పార్టీ మండల రెండో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ పాలనలో అన్ని వర్గాల ప్రజల భవిష్యత్ అంధకారంలోకి వెళ్లిపోయిందన్నారు. రోజు రోజుకు దేశంలో పేదరికం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పేదల కోసం పనిచేయాల్సిన ప్రధాని పెట్టుబడిదారుల కోసం పనిచేస్తున్నారని ఆరోపించారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 44చట్టాలను బీజేపీ ప్రభుత్వం రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మిక లోకాన్ని అభద్రతాభావంలోకి నెట్టివేసిందన్నారు. మోదీ, అమిత్‌షా నియంతృత్వ పాలన కొనసాగిస్తున్నారని, అడవుల్లో ఉన్న సహజ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం అర్హులందరికీ ఇవ్వాలన్నారు. 11 మందితో నూతన కమిటీ ఎన్నుకున్నారు. నాయకులు కనుకుంట్ల శంకర్, లక్ష్మణ్, బండారు పోచయ్య, లచ్చయ్య, రాజయ్య, యాదగిరి, ఎల్లయ్య, రాజు, భద్రయ్య పాల్గొన్నారు.

దాతలు భాగస్వాములు కండి

ఎంఈఓలు కృష్ణ, సత్తయ్య

గజ్వేల్‌రూరల్/కొండపాక(గజ్వేల్): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో దాతలు భాగస్వాములై విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయాలని ఎంఈఓలు కృష్ణ, బచ్చలి సత్తయ్య కోరారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని సంగాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జై ఆర్యవైశ్య సేవా సమితి తల్లం అనంతలక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్(మోతీనగర్) ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు రూ.45 వేల విలువైన స్కూల్ బ్యాగులు, వాటర్ బాటల్స్, నోటు పుస్తకాలు తదితర సామగ్రిని అందజేశారు. అలాగే కొండపాక మండల వ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం నుంచి మంజూరైన నోట్ బుక్స్‌తోపాటు దాతల సహకారంతో సమకూర్చిన నోట్ బుక్స్‌ను కుకునూరుపల్లిలోని ఎంఈఓ కార్యాలయంలో బచ్చలి సత్తయ్య హెచ్‌ఎంలకు అందజేశారు. కార్యక్రమాలలో హెచ్‌ఎం వేణు, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ట్రస్టు సభ్యులు శ్రీనివాస్, రవి, లక్ష్మీనారాయణ, భిక్షపతి, యాదగిరి, రవీందర్, భూమేశ్, సీఆర్పీలు గీత, చంద్రశేఖర్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు. హెచ్‌ఎంలు శ్రీనివాస్‌రెడ్డి, చీల రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనర్హులకే ఇళ్లు కేటాయించారు

ఎంపీడీఓకు బీజేపీ నాయకుల ఫిర్యాదు

అక్కన్నపేట(హుస్నాబాద్): అనర్హులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని, వారిపై విచారించాలని కోరుతూ బీజేపీ మండలాధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీడీఓ భానోతు జయరాంకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ కమిటీల పేరుతో గ్రామాల్లో నచ్చిన వారికే ఇళ్లు ఇచ్చారన్నారు. అర్హులకు ఇళ్లు మంజూరు చేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నాయకులు వేణుగోపాల్‌రావు, సంపత్, రవికుమార్, సుమన్, కల్యాణ్, కనకయ్య, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

మిరుదొడ్డి(దుబ్బాక): పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యాల వల్ల సమస్యలు వస్తున్నాయని మండల పరిధిలోని ధర్మారం గ్రామస్తులు ఎంపీడీఓ గంగుల గణేశ్‌రెడ్డికి శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో మురుగు కాలువలు, తాగునీటి సమస్య ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. కార్యదర్శిని వెంటనే తొలగించి మరొకరిని నియమించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, నాయకులు మహేందర్, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

మద్దూరు(హుస్నాబాద్): పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని బైరాన్‌పల్లి శివారులో మన్నెం లింగారెడ్డి వ్యవసాయ బావివద్ద పేకాట ఆడుతున్నారనే సమాచారంతో మద్దూరు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడిచేశారు. ఐదుగురు వ్యక్తులతో పాటు రూ.5,080, నాలుగు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లింగారెడ్డిపల్లి, ఇందిరమ్మ కాలనీ, శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయం, రేణుకానగర్, వీజేడీ కాలనీ, ఇమాంబాద్, ప్రాంతాలలో ఉదయం 8.30 నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. అలాగే నర్సాపూర్, కరీంనగర్ బైపాస్ రోడ్డు ప్రాంతాలలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

చిన్నకోడూరులో..

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల కేంద్రంలో విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ చాంద్‌పాషా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మంత్రికి వెంకటయ్య సన్మానం



మంత్రి లక్ష్మణ్‌కు బొకే అందిస్తున్న వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): రాష్ట్ర దళిత, గిరిజన దివ్యాంగుల సంక్షేమశాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన అడ్లూరి లక్ష్మణ్‌ను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ శనివారం హైదరాబాద్‌లోని డా.బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. దళితబంధు పథకానికి నిధులు విడుదల చేయాలని కోరారు.

ప్రజా సంక్షేమానికే ప్రాధాన్యం

మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి



తోటపల్లిలో పీహెచ్‌సీ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

బెజ్జంకి(సిద్దిపేట): ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసమే రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని తోటపల్లిలో రూ.1.56 కోట్లతో నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ భవనంతోపాటు మండలంలోని పలు అభివృద్ధి పనులను ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మౌలిక వసతులతో పాటు ఆరోగ్యశాఖలో ఉద్యోగాల భర్తీ చేస్తున్నారన్నారు. అనంతరం తోటపల్లిలో పీహెచ్‌సీ నూతన భవనం, గాగిల్లాపూర్, బెజ్జంకి మాడల్ స్కూల్‌లో సైన్స్ ల్యాబ్‌లు, కేజీబీవీలో అదనపు తరగతి గదులు, వడ్లూరులో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. రూ.17.59 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఆయా కార్యక్రమాలలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ ప్రవీణ్, వైద్యాధికారి కృష్ణతేజ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, రత్నాకర్‌రెడ్డి, పులి కృష్ణ, ప్రభాకర్, పోచయ్య, శ్రీనాథ్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు సంగీత, శ్వేత, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సంతోష్, నర్సయ్య, సంపత్‌రెడ్డి, మల్లికార్జున్, మధుసూదన్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు శంకర్



మాట్లాడుతున్న శంకర్ ముదిరాజ్

హుస్నాబాద్: ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రధాని మోదీ లక్ష్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్‌ముదిరాజ్ అన్నారు. మోదీ 11 సంవత్సరాల సుపరిపాలన పూర్తయిన సందర్భంగా స్థానిక సుభాష్‌నగర్‌లో శనివారం బీజేపీ వికసిత్ భారత్ సంకల్పసభ నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో శంకర్ మాట్లాడారు. భారత్ అభివృద్ధి చెందుతున్న గ్లోబల్ ఆర్థిక శక్తిగా ఎదుగుతుందన్నారు. కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, వీరాచారి, రవి, సంతోష్, నర్సయ్య, దీపిక, రాంప్రసాద్, శ్రీనివాస్, నాగార్జున్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌ను అడ్డుకోవడం అందరి బాధ్యత

ఏసీపీ సదానందం

హుస్నాబాద్: ప్రతి ఒక్క మహిళ డ్రగ్స్‌ను అడ్డుకోవడం తన బాధ్యతగా చూడాలని, ఇంటిని, ఊరును కాపాడుకున్నప్పుడే ఆరోగ్యమైన సమాజం ఏర్పడుతుందని ఏసీపీ సదానందం సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర ముగింపు సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ మాట్లాడుతూ గ్రామాల్లో విస్తరించిన డ్రగ్స్, బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్‌పై యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆర్డీఓ రామ్మూర్తి మాట్లాడుతూ యువత నైతిక విలువలతో ఆదర్శంగా ఉండాలన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, జేఏసీ నియోజకవర్గ కన్వీనర్ లక్ష్మారెడ్డి, కో-ఆర్డినేటర్లు వీరన్న, సారయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, నాయకులు రవీందర్, ప్రకాశ్, కుమార స్వామి, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపు చేసిన వారిపై కేసు



అంకిరెడ్డిపల్లిలో ఇసుక డంపులను సీజ్ చేస్తున్న త్రీటౌన్ ఎస్ఐ మల్లేశం

కొండపాక(గజ్వేల్): అక్రమంగా ఇసుక డంపు చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ ఎస్ఐ మల్లేశం తెలిపారు. ఆయన కథనం ప్రకారం కొండపాక మండలంలోని అంకిరెడ్డిపల్లి శివారులో రాసుల మల్లయ్య, కుసుమ మోతయ్య కొంత కాలంగా నంగునూరు మండల శివారు లోంచి ఇసుకను ట్రాక్టర్లతో తీసుకువచ్చి డంపు చేస్తున్నారు. గ్రామం చుట్టు ప్రక్కల వారికి అధిక ధరలకు అమ్ముతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లి తనిఖీ చేయగా రెండు చోట్ల సుమారు 50 టన్నుల ఇసుకను ఇండ్ల మధ్య చెట్లచాటున డంపు చేసినట్లు గుర్తించి సీజ్ చేసినట్లు ఎస్ఐ మల్లేశం తెలిపారు.

సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఇందిరమ్మ ఇళ్లు కేటాయించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు శనివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ మాట్లాడారు. 43వ వార్డులకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారన్నారు. అర్హులందరికీ ఇళ్లు అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. నాయకులు మహేందర్, ఆనంద్, రియాజొద్దీన్, నజ్జు, మధు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **సిద్దిపేట జట్టు విజయం**

సిద్దిపేటజోన్: స్థానిక స్టేడియంలో జరుగుతున్న క్రికెట్ పోటీలో సిద్దిపేట ఆరెంజ్ జట్టు సంగారెడ్డి జట్టుపై విజయం సాధించింది. అండర్19 పోటీల్లో భాగంగా శనివారం నిర్వహించిన ఈ మ్యాచ్‌లో మొదట సంగారెడ్డి ఎల్లో జట్టు 32 ఓవర్లలో 127 పరుగులకే ఆలౌట్ అయింది. సిద్దిపేట ఆరెంజ్ జట్టు 20 ఓవర్లలో లక్ష్యం ఛేదించింది. సిద్దిపేట క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మల్లికార్జున్ పర్యవేక్షించారు.

◆ **నిబంధనలు పాటించడం తప్పని సరి**

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని ఏఎస్ఐ శేఖర్ సూచించారు. మిరుదొడ్డిలో శనివారం ట్రాఫిక్ నిబంధనలపై ఆయన అవగాహన కల్పించారు. విధిగా హెల్మెట్‌ను ధరించాలని, మైనర్లు వాహనాలు నడిపితే వాహన యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

◆ **250 మందికి వైద్య పరీక్షలు**

మిరుదొడ్డి(దుబ్బాక): హైదరాబాద్ మల్లారెడ్డి హాస్పిటల్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మోతె గ్రామంలో శనివారం వైద్యశిబిరంలో సుమారు 250 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. శస్త్ర చికిత్సల కోసం 50 మందిని మల్లారెడ్డి ఆస్పత్రికి రిఫర్ చేశారు. మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, నాయకులు రంజిత్, రాజేశ్వర్, నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **జీవితాలను నాశనం చేసుకోవద్దు**

మద్దూరు(హుస్నాబాద్): యువత మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ షేక్ మహబూబ్ సూచించారు. దూళిమిట్ట మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలల్లో డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభ్యున్నతి**

మద్దూరు(హుస్నాబాద్): కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభ్యున్నతి సాధ్యమని మాజీ జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి అన్నారు. మండలంలోని జాలపల్లిలో ఎస్సీ కమ్యూనిటీహాల్ నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. జనగామ జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు కమలాకర్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

◆ **యువతి అదృశ్యం**

సిద్దిపేటకమాన్: యువతి అదృశ్యమైన ఘటన పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు కథనం ప్రకారం పట్టణానికి చెందిన పరశురాములు భార్య ఇద్దరు కూతుళ్లతో కలిసి ఖాదర్‌పురలో నివాసం ఉంటున్నాడు. అతడి భార్య చిన్నకూతురుతో కలిసి చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లింది. హైదరాబాద్ నుంచి తల్లి తన పెద్దకూతురు నవ్యకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. విషయం తెలుసుకున్న పరశురాములు ఇంటికి వెళ్లి చూడగా నవ్య కనిపించలేదు. దఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.